www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 మార్చి 2024
5
అన్నమయ్య



'మిట్స్‌'లో ఎన్‌పిటిఇఎల్ పరీక్ష

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులు, అధ్యాపకులకు నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్హాన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పిటెల్), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాసు వారు స్వయం అను పేరుతో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్స్ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ పరీక్ష లో 1696 మంది నమోదు చేసుకోగా 1629 మంది హాజరయ్యారన్నారు. వివిధ సబ్జెక్టుల్లో ఆన్‌లైన్ పరీక్షలను ఎన్‌పిటెల్ వారు సంవత్సరానికి రెండు సార్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆన్‌లైన్ సర్టిఫికెట్‌ను వారు అందజేస్తారని తెలిపారు. ప్రతి ఏటా తమ విద్యార్థులు,అధ్యాపకులు ఈ పరీక్షలు రాస్తారన్నారు.



పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

మాధవరంలో విషాదం

- ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య
- రైలు కింద పడి భర్త..ఉరేసుకుని భార్య, కుమార్తె..
- ఘటనా స్థలంలో సూసైడ్ నోట్ లభ్యం
- రెవెన్యూ అధికారులు మోసం చేశారని బలవన్మరణం

రెవెన్యూ అధికారుల ధనదాహానికి ఓ నిండు కుటుంబం బలి అయింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వేర్వేరు ప్రాంతాల్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈఘటన ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. సంఘటనతో గ్రామమంతా ఉలిక్కిపడింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..





ఉరేసుకుని మృతి చెందిన పద్మావతి, వినయ, రైల్వే ట్రాక్‌పై సుబ్బారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట


కొత్తమాధవరానికి చెందిన పాలసుబ్బారావు (47) చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఒంటిమిట్ట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 2185/2లో మూడెకరాల భూమి ఉంది. ఆ భూమిని అమ్ముదామని ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో రికార్డులు తారుమారు చేశారు. కట్టా శ్రావణి అనేపేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించడంతో మనస్థాపం చెందిన సుబ్బారావు, అతని భార్య పద్మావతి(41), కుమార్తె వినయ (17) ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఉదయం తల్లీకూతుళ్లు ఇంట్లోనే ఉరేసుకుని మృతి చెందారు. పాల మనిషి వచ్చి తలుపు తట్టగా ఎవరూ తీయకపోవడంతో అతను స్థానికులకు తెలియజేశాడు. వారు తలుపు తీసి చూడగా తల్లీకూతుళ్లు విగత జీవులుగా పడి ఉండడం చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సుబ్బారావు మాత్రం ఒంటిమిట్ట చెరువు దగ్గర ఉన్న రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సిఐ పురుషోత్తమరాజు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ట్రాక్‌పై సూసైడ్ నోట్ లభించింది. కడప డిఎస్‌పి షరీఫ్ కొత్త మాధవరంలోని మృతుల ఇంటిని పరిశీలించారు. ఆత్మహత్యలపై స్థానికులతో ఆరా తీశారు. మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.



పాల సుబ్బారావు, పద్మావతి (ఫైల్‌ఫోటో)

ఆన్‌లైన్‌లో భూ కబ్జా..

పాల సుబ్బారావు చేనేత కార్మికుడిగా మగ్గం పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్నాడు. ఒక కుమార్తె హైదరాబాద్‌లో చదువుకుంటుంది. అతనికి మూడెకరాల భూమి ఉంది. 2015లో తన పేరుపై ఆన్‌లైన్ చేశాడు. రైతు భరోసా కింద డబ్బులు పడుతూ ఉండేది. రెండేళ్ల కిందట ఇంటి అవసరాల కోసం తన తన పేరుమీదగాక కట్టా శ్రావణిపై ఉంది. ఈ విషయంపై అతను రోజూ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగేవాడు. ఎలాంటి ప్రయోజనం లేకపోవడం, పేద కుటుంబం కావడంతో ఇద్దరి కుమార్తెలను ఎలా పోషించుకోవాలో అర్థం కాక ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికులు పేర్కొం టున్నారు. రెవెన్యూ అధికారుల మోసానికి నిండు కుటుంబం బలైందని వాపోతున్నారు.



సూసైడ్ నోట్‌చూపుతున్న డిఎస్‌పి

సూసైడ్ నోట్‌లో..


మూడెకరాల పొలాన్ని అమ్ముకోవాలని అనుకోగా రెవెన్యూ అధికారులు తమ పొలాన్ని వేరే వారి పేర్లపై మార్చి మోసం చేశారని, ఏమీ చేయలేని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సూసైడ్ నోట్‌లో రాసింది ఉంది.

డాగ్ స్క్వాడ్ పరిశీలన..

డిఎస్‌పి ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ మృతుల ఇంటి చుట్టూ పరిశీలించారు. జాగిలం ఇంటి వెనుకభాగం వరకు వెళ్లి ఆగింది. తరువాత తిరిగి ఇంటి వద్దకు వచ్చింది. దీనిపై పోలీసులు సమాచారం ఇవ్వాల్సి ఉంది.

డిఎస్‌పి ఏమన్నారంటే..

రెవెన్యూ అధికారులు పాలసుబ్బారావు భూమిని ఆన్‌లైన్‌లో తారుమారు చేయడంతో మృతి చెందినట్లు సూసైడ్ నోట్‌లో రాసి ఉంది. సూసైడ్ ఆధారంగా విచారణ కొనసాగిస్తుమని కడప డిఎస్‌పి షరీఫ్ పేర్కొన్నారు.



మృతుల ఇంటి వద్ద డాగ్‌స్క్వాడ్ పరిశీలన

అధికారుల ఆగడాలకు హద్దే లేదు..

రెవెన్యూ అధికారుల ఆగడాలకు అంతే లేకుండా పోయింది. వారి అండదండలతో కబ్జాదారులు భూములను ఆక్రమిస్తున్నారు. వారి ధనదాహానికి ఓ నిండు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఆన్‌లైన్‌లో అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

-పన్నెల చంద్ర శేఖర్, గ్రామ సర్పంచ్.

కఠినంగా శిక్షించాలి

రెవెన్యూ అధికారుల మోసం వల్ల నా కుమార్తె, అల్లుడు, మనమరాలు ఆత్మహత్య చేసుకున్నారు. వారి మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి. నా ఇంకో మనమరాలిని ప్రభుత్వం ఆదుకోవాలి.

- వెంకటసుబ్బమ్మ, మృతురాలి పాలపద్మ తల్లి.

ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు : 'చమర్తి'

రాజంపేట అర్బన్ : వైసిపి పాలనలో ప్రజల ధన, మన, ప్రాణాలకు రక్షణ లేదని టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. వైసిపి నాయకులు ప్రకృతి సహజ సంపదైన భూమి, ఇసుక దోపిడీలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైసిపి నాయకుల దౌర్జన్యాలకు, భూదాహానికి రాష్ట్రంలో ఎందరో రైతులు, సామాన్య ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్

తమ భూమిని ఇతరుల పేర్లతో ఆన్‌లైన్ చేయడంపై మనస్థాపం చెంది మృతిచెందిన చేనేత కుటుంబానికి న్యాయం చేయాలని పిసిసి అధికార ప్రతినిధి పూల భాస్కర్ డిమాండ్ చేశారు. లంచం తీసుకొని దొంగ ఆన్‌లైన్ సృష్టించిన తహశీల్దారుపై చర్యలు తీసుకోవాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో సామాన్య ప్రజలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

రాబోవు వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఇందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఉపాధి హామీ పనుల కల్పన, హౌసింగ్ మ్యాన్ డేస్, ఎన్నికల మోడల్ కోడ్ అమలు తదితర అంశాలపై ఆర్‌డిఒలు, ఎంపిడిఒలు ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, పంచాయతీ, ఉపాధి, మున్సిపల్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో సిపిడబ్ల్యుఎస్, పిడబ్ల్యుఎస్, ఎంపీడబ్ల్యుఎస్ స్కీములు ఎన్ని, వాటి పరిస్థితి, ఎన్ని స్కీముల ద్వారా నీటి సరఫరా అవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. నీటి సౌకర్యం లేని ప్రాంతాలకు ఎలా సరఫరా చేయాలనే దానిపై ఆరా తీశారు. ఏయే గ్రామాల్లో నీటి ఎద్దడి ఉంది, జిల్లాలో ఉన్న బోర్లు, హ్యాండ్ పంప్స్ ఎన్ని, వాటిలో పనిచేస్తున్నవి ఎన్ని, మరమ్మతులకు గురైనవి ఎన్ని, రీఛార్జ్, డిపెనింగ్ చేయాల్సినవి ఎన్ని వంటి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సిపిడబ్ల్యుఎస్ స్కీములన్నీ సక్రమంగా పని చేసేలా చూడాలన్నారు. ఇతర మంచినీటి పథకాలకు వెంటనే మరమ్మతుల చేయాలన్నారు. నీటి ఎద్దడి గల ఆవాసాలను గుర్తించి నీటి సరఫరాకు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసం ఆఖరి వరకు జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు, హ్యాబిటేషన్లు, మున్సిపాలిటీ పరిధిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డిఒలు రోజూ పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటిని వృథా చేయకుండా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా ఎంపిడిఒలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా లేబర్ బడ్జెట్ సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ ఆధారంగా కుటుంబాలకు, వ్యక్తిగత కూలీలకు ఉపాధి పనులను విరివిగా కల్పించాలన్నారు. ముఖ్యంగా కరువు మండలాల్లో పనుల కల్పనపై దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. ఉదయం 6 గంటలకే ఉపాధి హామీ పనులను ప్రారంభించాలని చెప్పారు. ఈ నెలాఖరుకు వార్షిక సంవత్సరం ముగుస్తున్నందున లక్ష్యాలను చేరుకునేందుకు విరివిగా పనులను కల్పించాలని పేర్కొన్నారు. నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన తరువాత ఈ వేసవిలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏప్రిల్, మే, జూన్ మాసాలలో కూడా ఉపాధి హామీ పనులను ప్రతి కుటుంబానికి కల్పించాలన్నారు. చేసిన పనులకు వేతనాలను త్వరితగతిన చెల్లించాలన్నారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. హౌసింగ్ మ్యాన్ డేస్‌లో భాగంగా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతున్నందున లేఅవుట్, పంచాయతీ వారీగా పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అమలవుతున్న ఎన్నికల కోడ్ అంశంపై మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. ఇంకా ఎక్కడైనా పోస్టర్లు, బ్యానర్లు, గోడ రాతలు, లోగోలు ఉంటే తొలగించాలన్నారు. వాలంటీర్లు, కార్యదర్శులు రాజకీయ ప్రచారాలలో పాల్గొన్న రాదని ఎవరైనా పాల్గొంటే తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలను ఆదేశించారు. ఇప్పటివరకు మోడల్ కోడ్ అతిక్రమణలో నేరుగా లేదా సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎన్నికల కోడ్ ఎవ్వరు అతిక్రమించకుండా తగిన అవగాహన కల్పించాలి. వివిటి, విఎస్‌టి బృందాలు వీడియోగ్రఫీ చేస్తున్నప్పుడు ఎంపిడిఒలు సందర్శించాలని సూచించారు. ఎక్కడైనా చీరలు, ఇతర వస్తువులు పంపిణీ జరక్కుండా తగిన పర్యవేక్షణ చేయాలి. షాపులు, గోడౌన్లు, మార్కెట్ యార్డులను చీరలు, ఇతర వస్తువులు లాంటి వాటిని వాటిని నిల్వ చేశారేమోనని పరిశీలించాలన్నారు. రాజకీయ ప్రచా రాలకు సువిధ, ఎన్‌కో యాప్ ద్వారా తగిన అనుమతులు తీసు కోవాలన్నారు. ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే సంబంధిత ఆర్‌ఒ లేదా జిల్లా ఎన్‌సిసి నోడల్ అధికారిని సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఎస్‌ఇలు ప్రసన్న కుమార్, వెంకట్రామయ్య, ఇరిగేషన్ డిఇ కృష్ణమూర్తి, డిపిఒ ధనలక్ష్మి, ఆర్‌డిఒలు రంగస్వామి, మోహన్ కుమార్, హరిప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

పోరాట యోధుడు భగత్‌సింగ్



రాయచోటి : భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి అరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

పోరాట యోధుడు భగత్‌సింగ్ అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు అన్నారు. శనివారం స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి సభ స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 ఏళ్ల వయసులోనే సోషలిజమే భారతదేశానికి అంతిమ లక్ష్యమని నమ్మి స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన విప్లవ యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లన్నారు. వారిని నిర్దాక్షిణ్యంగా ఉరి తీసినా స్వాతంత్ర్య పోరాటాన్ని బ్రిటిష్ వలసవాద ప్రభుత్వం ఆపలేక పోయిందన్నారు. భగత్‌సింగ్ మరణించిన తరువాత 16 ఏళ్ల పాటు దేశం నలుమూలలా పోరాటాలు వెల్లువెత్తాయని తెలిపారు. వీర తెలంగాణ పోరాటం, చల్లపల్లి జమీందారీ, కూలి పోరాటాలు, రైతాంగ పోరాటాలు, సైనికుల పోరాటాలతో సహా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఉక్కిరి బిక్కిరి చేసి దేశాన్ని వదిలి వెళ్లకతప్పని పరిస్థితికి తీసుకెళ్ళాయని, ప్రజా పోరాటాలకు ఎదురు లేదని నిరూపించాయన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక బ్రిటిష్ పాలనలాగే మోదాని పాలనను తీసుకొచ్చిందని, దేశ ప్రజల సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు దోచిపెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.జాబీర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగబసిరెడ్డి, సిఐటియు భాగ్యలక్ష్మి, ఫయాజ్ పాల్గొన్నారు. **మదనపల్లి :** భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు విష్ణు మాట్లాడుతూ భగత్‌సింగ్ నుంచి ప్రశ్నించడం, పోరాడటమే నేటి యువత నెరవేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, శివారెడ్డి, బాషా, గిరిధర్ పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో బిటి ప్రభుత్వ కళాశాలలో అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తన్న, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు, లెక్చరర్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

స్కౌట్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లి

క్రమ శిక్షణ, సేవా గుణాన్ని పెంపొందించాలని ఉద్దేశంతో ప్రతి మండలంలోనూ ప్రతి స్కూల్లోనూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్‌ను ప్రారంభించాలని జిల్లా అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, సభ్యులు లక్ష్మీకర్, భాస్కర్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం10 గంటలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక బెంగళూరు రోడ్‌లోని జిఆర్‌టి హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయులు అందరూ తప్పకుండా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పరీక్షా కాలం

ప్రజా'దృష్టి'

జిల్లాలో పరీక్షల సీజన్ నడుస్తోంది. ఒకవైపు టెన్త్, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సీజన్, మరోవైపు సార్వత్రిక రాజకీయాన్ని పరీక్షకు నిలవనుంది. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత చదువులతో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ప్రయత్నాలు చేయడం పరిపాటి. ఇదేతరహాలో రాజకీయ నాయకులు శాసన అధికారాల్ని, పదవులను సాధించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కడప, అన్నమయ్య జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటిని కైవసం చేసుకునే పనుల్లో ఆయా రాజకీయ పార్టీల తరుపున పలువురు అభ్యర్థులు నిమగ్నమయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల కోడ్‌ను వర్తింపజేసింది. రాబోయే మూడు నెలల్లో ఎటువంటి అభివృద్ధి కార్యకలాపాలు మొదలుకుని ఎటువంటి రాజకీయ పక్షపాతాలకు అవకాశం లేకుండా పోయింది. ఎన్నికల కోడ్ ప్రకటన దగ్గర నుంచి జూన్ మొదటి వారం వరకు రాజకీయ యజ్ఞం నడవనుంది. జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ చేసింది. రాజకీయ యజ్ఞంలో ఆయా పార్టీల అభ్యర్థులు నిజాయతీగా గెలిచి శాసన క్రతువులో నిలవాలి. కానీ పలువురు అభ్యర్థులు వ్యూహప్రతివ్యూహాలతో ఒకరిపై ఒకరు పైచేయి సాధించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తుండడం పరిపాటిగా మారింది. ఇటువంటి అనైతిక కార్యకలా పాలతో గెలిచిన గెలుపు గెలుపే కాదని గ్రహించాలి. మందు, మత్తు, మనీ పంపిణీ వంటి అనైతిక పద్ధతుల ద్వారా గెలవడం ఓటమితో సమానమని గ్రహించాలి. ఇటువంటి ప్రజాస్వామ్య గాంధేయ పద్ధతులతో ఎన్నికల్లో గెలిచిన వారే నిజమైన విజేతలు. ఇటువంటి విజేతలకు పదవీయోగం పట్టాలి. అందలమూదక్కాలి. కానీ సార్వత్రిక ఎన్నికల చివరి క్రతువు నాటికి ప్రజాస్వామ్యం అపహాస్యం పాలు కావడం పరిపాటిగా మారింది. ఎన్నికల్లో ఓడిన వారికీ పార్టీల తరుపున ప్రాతినిద్యం వహించిన నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులుగా ఆధిపత్యం వహించడం పరిపాటిగా మారింది. ఒకవేళ తాము ప్రాతినిథ్యం వహిస్తున్న పార్టీకి అధికారం దక్కి ఓటమి పాలైన ఇన్‌ఛార్జులే విజేతల తరహాలో రాజబోగం అనుభ వించడం తెలిసిందే. గెలిచిన అభ్యర్థుల పార్టీ ఓడినా ఎటువంటి ప్రాధాన్యత ఉండదు. ఒకవేళ సంకీర్ణం ఏర్పడినా, స్వల్ప మెజార్టీతో అధికారం చేపట్టినా రాజకీయం రసవత్తరంగా మార నుంది. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇటువంటి ఘటనలు చోటుచే సుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికైనా ఎన్నికల క్రతువులో నిలిచిన అభ్యర్థులు ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రంజాన్ వేళలు



ఇఫ్తార్ ఆదివారం (సా)	షహారీ సోమవారం (ఉ)
6.30	5.01

నాయకుల ఫొటోలు తొలగించాలి : జెడి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో రైతులకు పంపిణీ చేస్తున్న ఎరువుల బస్తాలపై రాజకీయ పార్టీ నాయకుల ఫొటోలు ఉండకూడదని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించే దుకాణాలలో ఎటువంటి రాజకీయ సంబంధితమైన ఫొటోలు, బ్యానర్లు లేకుండా చూడాలని చెప్పారు. ఎరువులు బస్తాలపై ప్రధానమంత్రి ఫొటో ఉంటే వెంటనే కప్పి వేయాలన్నారు. అన్నమయ్య జిల్లాలో ఇప్పటి వరకు ఎరువులు పైన ప్రధానమంత్రి ఫొటో గమనించి ఎన్నికల ప్రవర్తన నియమావళి కింద 474 మెట్రిక్ టన్నులు, 10 లక్షలు విలువ గల ఎరువుల అమ్మకాలను నిలిపివేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. ఎరువులు బస్తాలపై ఉన్న ప్రధానమంత్రి ఫొటోని తెలుపు రంగు ద్వారా గాని లేదా కనిపించకుండా చేసి సంబంధిత మండల వ్యవసాయ అధికారిని సంప్రదించినట్లయితే అటువంటి బస్తాలని నిలుపుదల నుంచి తొలగించి అమ్మకానికి అనుమతిస్తారన్నారు. ఎవరైనా డీలర్లు జిల్లాలో ఎన్నికల నియమాలని అతిక్రమించి అటువంటి బస్తాలు విక్రయిస్తే వారిపై ఎన్నికల క్రమశిక్షణ నియమాలు ప్రకారం చర్యలు తీసుకుని లైసెన్సులు కూడా రద్దు చేయడం చేస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి మల్లూరమ్మ జాతర

ప్రజాశక్తి -చిన్నమండెం

మండలంలోని మల్లూరు కొత్తపల్లి గ్రామంలో మాండవ్య నది తీరాన 16వ శతాబ్దంల వెలసిన శ్రీ శ్రీ మల్లూరమ్మ ఆలయంలో ఈనెల 25, 26 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి. కొండారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరమూ ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున అమ్మవారికి ఉదయం సిద్ధల పూజ బోనాలు పట్టు వస్త్రాల సమర్పిస్తారన్నారు. రాత్రికి చాందిని బండ్ల ఊరేగింపు ఉంటుందని, మంగళవారం రోజున పగలు మైల తిరుణాల నిర్వహిస్తారని తెలిపారు.

టిడిపి వర్క్‌షాప్‌లో అభ్యర్థులు

ప్రజాశక్తి -రాయచోటి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అమరావతి ఏ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన 'ప్రజా గళం - తెలుగుదేశం పార్టీ ఎన్నికల వ్యూహం' వర్క్ షాప్‌లో అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురు టిడిపి అసెంబ్లీ అభ్యర్థులు పాల్గొన్నారు. వర్క్ షాప్‌లో రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు, రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, తంబళ్ళపల్లి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్ర రెడ్డి, రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చంగల్ రాయుడు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - లక్కిరెడ్డిపల్లి : స్థానిక ఎపి మోడల్ కళాశాలలో 2024 -25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి మోడల్ స్కూల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష రాసిన వారు ఇంటర్ మొదటి సంవత్సరం బైపిసి, ఎంపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏపీ మోడల్ కళాశాలలో ఉచితంగా ఆంగ్ల విద్యా బోధన ఉంటుందని, ఎలాంటి ఫీజులు ఉండవని, ప్రతి విద్యార్థీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి కలదని ఆయన తెలియజేశారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు పూర్తి చేసి ఏపీ మోడల్ స్కూల్‌లో అందజేయాలన్నారు.

ఎంసిసి నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ ఎంసిసి నిబంధనలు తప్పక పాటించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంసిసి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పమన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏ పని చేయాలన్నా తప్పకుండా అనుమతి తీసుకోవాలని చెప్పారు. కుల, మత, ప్రాంతీయ పరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయనేతలు ప్రవర్తించడం, మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ఇతర ప్రార్థన స్థలాల్లో ఎన్నికల ప్రచారం చేయడం, అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం,లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయడం, డబ్బులు పంపిణీ చేయడం, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించడం, వంటివి నిషిద్ధమన్నారు. ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడూ జారీ చేసే నిబంధనలను చక్కగా అవగాహన చేసుకుని నిర్దేశిత సమయంలోనే పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఎంసిసి వైలేషన్స్ జరిగినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామస్థాయిలో రాజకీయ పార్టీలకు సంబంధించి బ్యానర్లు పెక్సీలు కటౌట్స్ పర్మిషన్ లేకుండా ఉండకూ డదన్నారు. అంగన్వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, ఆర్‌పిలు, వాలంటీర్లు రాజకీయ పార్టీ నాయకుల వెంట ర్యాలీలలో, ప్రచార కార్యక్రమాలలో పాల్గొనకుండా చూడాలని పేర్కొన్నారు. ఎవ్వరైనా పాల్గొంటే వారిని వెంటనే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఓటర్ జాబితాకు సంబంధించి వచ్చిన అన్ని ఫార్మ్ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరు సి విజిల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని ఎన్నికలకు సంబంధించి ఎక్కడి నుంచి అయినా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్యాంపెయిన్, ర్యాలీకి సంబంధించి, వెహికల్, లౌడ్ స్పీకర్, స్కూల్ గ్రౌండ్, ఫ్లాగ్స్, బైక్ ర్యాలీకి సంబంధించి అనుమతి కోసం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం చేశామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్‌ఒలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గణిత శాస్త్రంపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి - రాయచోటి

అన్ని ఇంజినీరింగ్ విభాగాలకు గణితం మూలమని, దీనిపై పట్టు సాధించాలని వైవీయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళా శాలలో శనివారం నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియం సాయి సాంకేతిక-2కె 24 కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీధర్ బాబు, విశిష్ట అతిథిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.చంద్రమోహన్, సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సుకు ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల్లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 32 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ బాబు మాట్లాడుతూ గణిత శాస్త్రంపై పట్టు సాధిస్తే సాఫ్ట్‌వేర్ రంగం, వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలలో రాణించ గలుగుతారని అభిప్రాయపడ్డారు. డాక్టర్ కె.చంద్రమోహన్ మాట్లాడుతూ ఇలాంటి జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియం, పేపర్ ప్రెజెంటేషన్, క్విజ్ లాంటి పోటీలలో పాల్గొనడం వల్ల ప్రతిభ మరింత మెరుగుపడుతుందని చెప్పారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే కోర్సు ప్రణాళికను సిద్ధం చేసుకొని అత్యధిక మార్కులు సాధించాలని టెక్నికల్ సింపోజియంలో పాల్గొనడం వలన వివిధ టెక్నికల్ అంశాలను ఒకేచోట ప్రదర్శించి, చర్చించడం వలన అనేక అంశాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎన్.నాగేంద్ర మాట్లాడుతూ మొదటి సంవత్సరం నుంచి ఇటువంటి టెక్నికల్ సింపోజియంలో పాల్గొనడం వల్ల భావ ప్రకటన స్వేచ్ఛ పెంపొందించుకుని వివిధ అంశాలపై అవగాహన పెంచుకుని కమ్యూనికేషన్ స్కిల్స్ పై పట్టు సాధిస్తారని చెప్పారు. ఈ సింపోసియంలో మాథెమాటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ విభాగాల్లో120 పత్రాలను, విద్యార్థులు సమర్పించారు. ఫిజిక్స్ విభాగంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన నందకిషోర్ జి.అనిల్ కుమార్ మొదటి బహుమతి, శ్రీసాయి కళాశాలకు చెందిన కె.జ్యోష్ణ, రోహిణి రెండవ స్థానం, ఇంగ్లీష్ విభాగంలో శ్రీసాయి కళాశాలకు చెందిన అఫియా సుల్తానా మొదటి స్థానం, జయ ప్రకాష్‌రెడ్డి, దామోదర్ రెండవ స్థానం, ఇంజినీరింగ్ మ్యాథమెటిక్స్ విభాగంలో శ్రీ సాయి కళాశాల నుండి ఎం.హిబా ఫాతిమా మొదటి స్థానం ఎఐటిసికి చెందిన ఎం.బృంద, రేడ్డమ్మ రెండవ స్థానం, ఇంజనీరింగ్ కెమిస్ట్రీ విభాగంలో శ్రీసాయి కళాశాల నుండి ఎం.సాయి దీప్న మొదటి స్థానం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల నుంచి బి.హర్షవర్ధన్, చైతన్య రెండవ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఓటు వేయడం మన హక్కు'

ప్రజాశక్తి-పీలేరు

ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలని పీలేరు ఓటు నమోదు అధికారి, అదనపు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమా తెలిపారు. వ్యవస్థీకృత ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం కార్యక్రమంలో భాగంగా పీలేరు నియోజకవర్గం ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం నుంచి ఓటు హక్కు వినియోగంపై ప్రజలను జాగృత పరిచేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం మన వంతు పాత్ర పోషిద్దామన్నారు. భారత రాజ్యాంగం మనకు కల్పించిన ప్రాథమిక హక్కుల్లో మొదటిది ఓటు హక్కని. దాన్ని వినియోగించుకోవడం ఈ దేశ పౌరులైన మన ప్రధాన కర్తవ్యమని తెలియజేశారు. అనంతరం వారు ట్రాన్స్ జెండర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ పరిధిలోని మండల ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పుణ్యవతి పిలుపునిచ్చారు. మండల ఓటరు జాబితాని రెవెన్యూ అధికారులు డిప్యూటీ తహశీల్దార్ మొహమ్మద్ అన్సారీ, నగర పంచాయతీ ఆర్ఐ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కూలిపోయిన చిరునామా, డోర్ నెంబర్లతో ఓటు కార్డులు ఉన్నట్లు ఫిర్యాదు రావడంతో సదరు రెవెన్యూ అధికారులు, నగర పంచాయతీ అధికారులు, సచివాలయ సెక్రెటరీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొరబాటు ఎక్కడ జరిగిందో, ఎలా జరిగిందో పూర్తిగా విచారిస్తామని పేర్కొన్నారు. పొరపాట్లకు కారణమైన సంబంధిత అధికారులకు షోకాస్ నోటీస్ ఇస్తామని పేర్కొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని మల్లురు, కొత్తపల్లి గ్రామాల్లో శనివారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపిడిఒ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఓటు వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వార్ఒలు, అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



చిన్నమండెం : ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

గంజాయికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ : టిడిపి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.జె.వెంకటేష్

ప్రజాశక్తి-మదనపల్లి

ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడానికి నాడు నారా చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకొని పనిచేస్తే నేడు జగడమోహన్‌రెడ్డి అందుకు భిన్నంగా పనిచేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాజంపేట అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ అన్నారు. శనివారం మదనపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఏపీ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే ప్రయత్నం గతంలో టిడిపి ప్రభుత్వం చేస్తే, ఇప్పుడున్న వైసిపి ప్రభుత్వం మాత్రం మూడు రాజధానులు అంటూ ప్రజలను మభ్యపెట్టి ఏ ఒక్క రాజధానిని కూడా ప్రకటించలేని జగన్ యొక్క అసమర్థ పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. తెలుగు ప్రజల కళ అయినటువంటి పోలవరం ప్రాజెక్టుని సైతం నిర్మించలేక, ప్రతి అసెంబ్లీ సమావేశాలు బూటకపు మాటలు చెప్పి ఐదేళ్లు పబ్బం గడిపారన్నారు. ప్రపంచంలోనే అరుదైన సంపద అయిన ఎర్రచందనాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉన్న ప్రభుత్వం, వైసిపి నాయకులకు కార్యకర్తలకు అండగా నిలబడి ఎర్రచందన అక్రమ రవాణాకు సహకరించడం వల్ల నేడు ఆ అరుదైన సంపద కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా విశాఖపట్నంలో రూ.50 వేల కోట్ల విలువచేసే 25 వేల కిలోల గంజాయిని టాస్కోఫోర్స్ పట్టుకుంటే, అక్కడున్న పోలీస్ అధికారైన సిపినే అడ్డుకొని నిజానిజాలు దాచే ప్రయత్నం చేశారన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కూడా పోలీసులు వైసిపి నాయకులు అండగా నిలబడడం దేనికి సంకేతమని పోలీసు వ్యవస్థపై కొంత అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గంజాయి వ్యాపారవేత్తగా విజయసాయిరెడ్డి ఎదిగారని కొంతమందిని బినామీలుగా పెట్టుకుని రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయిని అమ్మి రాష్ట్రంలో ఉన్నటువంటి యువతని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్మోహన్‌రెడ్డి సొంత బాబాయ్‌ని చంపి నారావారి రక్త చరిత్ర అంటూ మొదలుపెట్టి కోడి కత్తి శ్రీను తర్వాత గంజాయి సరఫరా వరకు అన్నిటిని టిడిపి అధినేత చంద్రబాబుపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని, వీటిని ప్రజలు నమ్మరని మరోసారి వైసిపి అసత్య ప్రచారం బయట పడుతోందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్నటువంటి పరిస్థితులను ప్రజలందరూ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో టిడిపిని అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని కాపాడుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్లమెంటరీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి అన్వర్‌బాషా, నవీన్, వంటికుండ రెడ్డప్ప, రామచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన సింపోజియం

ప్రజాశక్తి-మదనపల్లి

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం శనివారం ఘనంగా నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో చివరి రోజు ఫుడ్ స్టాల్స్ నిర్వహించామన్నారు. ఈ ఫుడ్ స్టాల్స్‌లో విద్యార్థులు వివిధ రకాల తినుబండారాలను అందుబాటులో ఉంచారన్నారు. మెకానికల్, సివిల్, ఆర్టిఫిషియల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో పేపర్ ప్రజెంటేషన్ నిర్వహించారని తెలిపారు. విద్యార్థులు మరెన్నో విజయవంతమైన ప్రాజెక్టులను తయారుచేసి టెక్నాలజీని ఉపయోగించుకొని భవిష్యత్తులో మరింత ముందుకు దూసుకెళ్లాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు విద్యార్థులను, అధ్యాపకులను, సిబ్బందిని అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులను అభినందిస్తూ మరెన్నో విజయవంతమైన కార్యక్రమాలను చేపట్టాలని సమాజానికి ఉపయోగపడే మరి ఎన్నో కొత్త కొత్త ప్రాజెక్టులను తయారు చేయాలని వివరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులచే నిర్వహించబడిన ఫుడ్ స్టాల్‌కి, పేపర్ ప్రజెంటేషన్‌కి మంచి స్పందన లభించిందన్నారు. వివిధ కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు, ఆదిత్య కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారని తెలిపారు.


సింపోజియం స్టాల్స్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

ప్రహరీ నిర్మాణాలను పరిశీలించిన ఎపిడి

ప్రజాశక్తి-కలకడ : మండలంలో నిర్మాణంలో ఉన్న పాఠశాలల ప్రహరీలను ఎపిడి రవికుమార్ శనివారం పరిశీలించారు. మండల కేంద్రమైన ఆదర్శ పాఠశాల ప్రహరీ పనులు కొంతవరకు పూర్తయినట్లు గమనించి, మిగిలిన పనులు ఎంతవరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కదిరాయ చెరువులో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మాణాలు పూర్తి కావడంతో వాటి చిత్రాలను ఉన్నతాధికారులకు పంపామన్నారు. కార్యక్రమంలో ఎపిఒ చెన్నకేశవులు, ప్లాంటేషన్ సూపర్వైజర్ మురళి, జెఇ రామకృష్ణ, రూప్ సాగర్, ఉపాధి సిబ్బంది టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

నిబంధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలి

ప్రజాశక్తి-పీలేరు : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను అనుసరించాలని పీలేరు సహాయ ఎన్నికల అధికారి మహబూబ్ బాష, ఎంసిసి అధికారి ఉపేంద్రరెడ్డి తెలిపారు. శనివారం రాత్రి స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల వారు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎంసిసిని ప్రతి ఒక్క రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు అనుసరించి తీరాలన్నారు. సమావేశంలో గుర్రంకొండ మండల సహాయ ఎన్నికల అధికారి శ్రీనాథ్, నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల ఎంసిసి అధికారులు జగదీశ్వర్, పరమేశ్వర్ రెడ్డి, రెడ్డయ్య, సుధాకర్ రెడ్డి, కృష్ణయ్య, సిఐ శంకర మల్లయ్య, ఎఎస్ఐలు రామ్మోహన్, హరినాథ్, టిడిలు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఐదు న్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి -రాయచోటి : సమాన వాటా న్యాయం, రైతు న్యాయం, శ్రామిక న్యాయం, యువ న్యాయం, నారీ న్యాయ్యం ఈ ఐదు న్యాయాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలందరూ ప్రజల్లో తీసుకెళ్లాలని డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్ అన్నారు. పట్టణానికి చెందిన డిసిసి మైనార్టీ చైర్మన్ ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లాల మీడియా కో-ఆర్డినేటర్‌గా పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల నియమించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మన్సూర్‌ను శాలువా కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు రఫిక్, జిల్లా ఉపాధ్యక్షుడు దర్బార్, జిల్లా మైనార్టీ సెక్రెటరీ యహియా భాష,మీడియా చైర్మెన్ నరేష్, మండల ప్రెసిడెంట్ ఆఫీజుల్లా, నాసర్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఉరుసు

ప్రజాశక్తి-రామాపురం : మండలంలోని నీలకంఠరావుపేట గ్రామ సమీపంలోని దర్బార్ సాయి నగరంలో వెలసిన దర్గా వద్ద ఉరుసు మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యుడు సత్యమయ్య స్వామి, శంకరయ్య స్వామీజీ చెప్పారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ శ్రీ సద్గురు హజరత్ దర్బార్ ఆలీ షా వలి రహంతుల్లా అలైబాబా శ్రీ జలీల్ మస్తాన్వలి బాబాల ఉరుసు ప్రతి ఏటా హోలి పండుగ రోజు నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. ఆదివారం దర్గావద్ద గంధం మహోత్సవం ఉంటుందన్నారు. సోమవారం జెండా మేరవని అదే రోజు రాత్రి బెంగళూరు వారిచే పెద్ద ఖవాలీ ఉంటుందని తెలిపారు. మంగళవారం తహలీల్ మహా నైవేద్యం ఇస్తారని చెప్పారు. ఈ ఉరుసు మహోత్సవాలకు హిందూ ముస్లిం అనే తేడా లేకుండా చుట్టుపక్కల గ్రామస్తులే కాకుండా మండల ప్రజలు జిల్లా ప్రజలు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొంటారన్నారు. దర్గా వద్ద ఉచిత పాఠశాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉచితంగా పాఠశాల విద్య అందిస్తున్నారని తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామాపురం ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.

'నారాయణ'లో ముందస్తు హోలీ సంబరాలు

ప్రజాశక్తి - రాయచోటి : పట్టణంలోని బోస్ నగర్‌లో ఉన్న నారాయణ స్కూల్‌లో ముందస్తు హోలీ సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకరి మీద ఒకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం శంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఖాదర్‌వల్లి, దీన యువరాజు, వైస్ ప్రిన్సిపల్స్ సుగుణ, నందిని, నారసింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై ఊరేగిన శ్రీలక్ష్మి నరసింహస్వామి

ప్రజాశక్తి-పెద్దమండ్యం : మండలంలోని పాపేపల్లి పంచాయతీలో కుశవతి నది తూర్పు తీరాన వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీలక్ష్మీ నరసింహస్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై సింహం వాహనంపై నాలుగు మాడ వీధుల్లో వేదమాత్రలతో, పిల్లనగ్రోవిలతో, బాణాసంచా వేడుకలతూ వివిధ పుష్పలతో అలంకరించి ఉరిపు గావించారు. కార్యక్రమంలో వాహన ఉబయదార్లు గల్లా శివ రామకృయ్య, గల్లన రసింహులు, గల్లా నారాయణ విహరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వై.విష్ణుమాచార్యులు, రఘునాధచార్యులు, అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు.


తేక్వాండోలో శిక్షణ ఇస్తున్న కరాటే మాస్టర్ సుధాకర్

తేక్వాండోలో విద్యార్థులకు మెలకువలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఐదు రోజులుగా బోయినపల్లిలోని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపు ద్వారా శనివారం మండల పరిధిలోని హస్తవరం చెర్లోపల్లె, కొత్త బోయినపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు తేక్వాండో మాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆత్మరక్షణ మెలకువలు నేర్పించి శిక్షణ ఇచ్చారని ఎన్ఎస్ఎస్ అధికారి వై.ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అన్నమాచార్య కళాశాల యాజమాన్యం కార్యదర్శి చొప్ప గంగిరెడ్డి, కోశాధికారి అభిషేక్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి, చైర్మన్ రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డి.స్వర్ణలత ఎన్ఎస్ఎస్ వారి ప్రత్యేక క్యాంపును అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అన్నమాచార్య కళాశాల అధ్యాపకులు ఆదినారాయణ, కళాశాల బృందం పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన


పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-కలకడ

వృథాగా పోతున్న తాగునీటి పైపులైన్‌కు అధికారులు శనివారం మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 20వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో 'తాగునీటి వృథాను అరికట్టరేరా' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన పంచాయతీ అధికారులు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టామని కార్యదర్శి దేవేంద్ర పేర్కొన్నారు.

రాజంపేట సీటు జనసేనకే కేటాయించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట అసెంబ్లీ టికెట్ జనసేన పార్టీకి కేటాయించాలని, నియోజకవర్గంలో పార్టీకి బలమైన కేడర్ ఉందని, అవకాశం ఇస్తే సత్తా చాటుతామని జనసేన పార్టీ సమన్వయ కర్త అతికారి దినేష్ పేర్కొన్నారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రలోభాలకు ఎవరూ లొంగవద్దని సూచించారు. వైసిపి నిరంకుశ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కలిగించడానికే తమ అధినేత పవన్ కళ్యాణ్ పొత్తులు పెట్టుకున్నారన్నారు. అధికారం, పదవుల కన్నా రాష్ట్ర భవిష్యత్తే పవన్ ఆకాంక్ష అని, అభిమానులు ఈ విషయం అర్థం చేసుకోవాలని కోరారు. రాజంపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు తాము నిర్వహించిన సేవా కార్యక్రమాలు, ప్రజలలో తమకున్న ఆదరణను గమనించి నియోజకవర్గ అసెంబ్లీ సీటు జనసేనకు కేటాయించి తనను అభ్యర్థిగా ప్రకటిస్తే జెండా ఎగరవేసి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వరలక్ష్మి, పోలిశెట్టి శ్రీనివాసులు, గుగ్గిళ్ళ నాగార్జున, కొట్టే శ్రీహరి ఓబులేసు, జయరామయ్య, శ్రీరాములు, కత్తి సుబ్బరాయుడు, ఇద్యాయత్, కళ్యాణ్, రాజా, కొండలరావు రవి, మస్తాన్ రాయల్, రత్నం పాల్గొన్నారు.


పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్ఓ బి.లీలారాణి

పోలింగ్ కేంద్రాల్లో ఆర్ఓ తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పలు పోలింగ్ బూతులను శనివారం రిటర్నింగ్ అధికారి బి.లీలారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు మౌలిక వసతులు, తాగునీరు, టాయిలెట్, విద్యుత్ తదితర సౌకర్యాలు అన్నింటిని తనిఖీ చేశామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి పొరపాట్లు జరగకూడదని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకొని యువతి యువకుల కోసం ఎన్నికల సంఘం ఓటర్లకు అవకాశం కల్పించడం జరిగిందని తెలియజేశారు. ఓటర్ నమోదు ప్రక్రియలో రెవెన్యూ సిబ్బంది, బిఎల్‌వోలు అలసత్వం వహించకూడదని తెలిపారు. అనంతరం బిఎల్వోలు వద్ద ఉన్న ఓటర్ జాబితాను పరిశీలించామన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వ హించేందుకు అధికారులు, ప్రజలు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో తీహశీల్దార్ వెంకటనారాయణ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్, బిఎల్‌వోలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


పార్కు అభివృద్ధి గురించి చర్చిస్తున్న సిసిఎఫ్ నాగేశ్వరరావు

ఎర్రచందనం పార్కు అభివృద్ధికి చర్యలు : సిసిఎఫ్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని వెంకటేశ్వరపురం సమీపంలోని ఎర్రచందనం పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని సిసిఎఫ్ నాగేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, కోడూరు రేంజ్ ఎఫ్ఆర్ఒ రఘునాధరెడ్డి, అటవీ శాఖ అధికారులు ఎర్రచందనం పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం పార్కును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని అందులో భాగంగా మైసూరివారిపల్లె పంచాయతీ పరిధిలోని శాంతినగర్ ప్రధాన రహదారి వద్ద నుంచి ఎర్రచందనం పార్కు వెళ్లేందుకు గతంలో మార్గం ఉండేదని ఆ మార్గాన్ని తిరిగి పునః ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కానీ ఆ ప్రాంత ప్రజలు అడ్డుకుంటున్నారని అన్నారు. ప్రధాన రహదారి నుంచి దారి ఏర్పాటు చేసినట్లయితే పర్యాటకులు ఎర్రచందనం పార్కుకు వచ్చి వెళ్లేందుకు అవకాశం ఉంటుందని ఆ మార్గాన్ని తెలుగు ప్రారంభిస్తామని తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. అటవీ ప్రాంతంలో సిబ్బంది నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

ప్రజాశక్తి-కలకడ

మండలంలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ శనివారం తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన కలకడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు), ఆదర్శ పాఠశాల, కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో స్క్వాడ్ అధికారులు శివా నాయక్, శ్రీధర్‌రెడ్డి తనిఖీలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు కావలసిన తాగునీరు, వైద్య సేవలు వారికి కావలసిన డెస్కులు ఏర్పాటు చేయడంపై సంతృప్తిని వ్యక్తపరిచినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌గా ఎం.మునీంద్రనాయక్ పరీక్షలు సజావుగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో 144 సెక్షన్‌లో భాగంగా హెడ్ కానిస్టేబుల్‌రెడ్డి బాబు, హోంగార్డు కె.వి రమణలు బందోబస్తు నిర్వహించారు. **నందలూరు :** మండలంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో స్క్వాడ్ డి. సుబ్బరాయుడు, రామ మోహన్ తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష కేంద్రం చీఫ్ శ్రీనివాసులు, డిపార్ట్మెంట్ ఆఫీసర్ చంద్రమోహన్‌లను అభినందించారు.


గౌస్ బాషాను సన్మానిస్తున్న శేఖర్‌రెడ్డి

గౌస్ బాషా సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య జిల్లా వైసిపి సంయుక్త కార్యదర్శి గౌస్‌బాషా సేవలు ప్రశంసనీయమని ఊటుకూరు ఎంపిటిసి నాగ చంద్రశేఖర్‌రెడ్డి, రాజంపేట నూర్‌బాషా సంఘం అధ్యక్షులు ఇమామ్ ప్రశంసించారు. కుల, మతాలకతీతంగా గౌస్‌బాషా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ శనివారం జిఎంసి కల్యాణ మండపంలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గౌస్‌బాషా సేవలను కొనియాడారు. గౌస్‌బాషా మాట్లాడుతూ ముస్లింల సమస్యలను పరిష్కరించడానికి తాను సదా ముందు ఉంటానని, ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కోబా మసీదు కమిటీ నాయకులు ఆరిఫ్, మహమ్మద్ అలీ, అహ్మద్, కటారుపల్లి మసీదు కమిటీ అధ్యక్షులు మహబూబ్ బాషా, ఉస్మాన్ నగర్ జుబేర్, నూర్ భాషా మస్తాన్, ముస్లిం మైనారిటీ నాయకులు ముజఫర్ అహ్మద్, సయ్యద్ అక్రమ్, ఎస్.జి ఇనాయాతుల్లా, మోసిన్‌ఖాన్, గౌస్‌ఖాన్, రెస్పెక్ట్ మౌలానా, ఆర్ఎస్ చాన్‌బాషా పాల్గొన్నారు.

నేడు కనక రుద్రమ్మదేవి తిరుణాల

ప్రజాశక్తి - పుల్లంపేట : మండల పరిధిలోని దేవరకొండలో వెలసిన కనక రుద్రమ్మదేవి తిరుణాల ఆదివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఊట్కూరు బయలుదేరి అర్ధరాత్రికి పివిజిపల్లి గ్రామానికి అమ్మవారి చేరుకుంటుందన్నారు. అక్కడ పూజల అనంతరం దేవరకొండకు చేరుకుంటుందన్నారు. తిరుణాలకు జిల్లాలోని అనేక ప్రదేశాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారిని ఉదయం నుంచి దర్శించుకొని పొంగళ్ళు నిర్వహించి అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం చాందిని బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు.

క్రైం కార్నర్


సారా తయారీ స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

700 లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి నిమ్మనపల్లి

నాటుసారా తయారీ స్థావరాలపై స్థానిక పోలీసులు, ఎస్ఎస్‌బి (స్పెషల్ ఫోర్స్) పోలీసులు స్థానిక ఎస్ఐ లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా కార్డెన్ సెర్చ్‌ను శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లోకేష్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో నాటు సారా తయారీ స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించి సారా తయారీ, రవాణా, విక్రయాలపై ఉక్కు పాదం మోపుతున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని బాలినాయునిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతాలలో ఎస్ఎస్‌బి పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీసులు కార్డెన్ సెర్చ్ తనిఖీలను చేపట్టారన్నారు. విస్తృత తనిఖీలలో భాగంగా నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 700 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. బాలినాయనపల్లెకే చెందిన బాలే సురేంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని తన వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. మండలంలో అసాంఘిక శక్తుల పైన, నాటుసారా తయారీకి పాల్పడే వారిపై ఉక్కు పాదం మోపుతున్నట్లు తెలిపారు. సారా తయారీకి పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, పదేపదే నాటు సారా కేసుల్లో పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ కేసులను సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌బి పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది రాజేష్, హరినాథ్ పాల్గొన్నారు.